డా॥ ముక్తేవి భారతి

చెంగల్వ కాళకవి

తంజావూరు రఘునాథ నాయకుని కాలంలో ఉన్న విజయరాఘవునికి "రాజగోపాల విలాసము" అనే శృంగార ప్రబంధాన్ని, అంకితం చేసిన కవి చెంగల్వ కాళకవి. ఈ కవి రఘునాథ నాయకుని ఆస్థానంలో ఉన్న రామభద్రాంబకు, విజయరాఘవుడి ఆస్థానంలో ఉన్న కృష్ణాజీకి కూడా గురువు. విజయరాఘవుడు కాళకవిని చాలా ఎక్కువగా ఆదరించాడు. కాళయ్య ఇంటికే విజయరాఘవుడు విచ్చేసేవారని, ఆ కవికి కానుకలు అందించి, ఆ కవి ఇంట్లో విందుభోజనం చేసేవాడని తెలుస్తోంది.

రాజగోపాలుడంటే తంజావూరులోని మన్నారు గుడిలో వెలసిన దేవుడు. ఈ స్వామి విజయరాఘవుని ఇష్టదైవం. విజయరాఘవుడికి మన్నారు దేవుడనే పేరు కూడా ఉంది. కాళకవికి ముద్దు చంద్రరేఖ అనే నర్తకితో బాగా స్నేహం. ఆ నర్తకి విజయరాఘవుని ఆస్థాన నర్తకి అయింది. ఆమె విజయరాఘవుని ప్రియురాలిగా కూడా గుర్తింపు పొందింది. కాళకవి రచించిన రాజగోపాల విలాస ప్రబంధాన్ని విజయ రాఘవుడు అంకితం తీసుకోవటంలో చంద్రరేఖ పాత్ర కూడా కొంత ఉండి ఉండవచ్చు. ఆ కృతజ్ఞతా భావంతోనే, కాళకవి తన ప్రబంధంలో ప్రతీ ఆశ్వాసంలోనూ చంద్రరేఖ పేరుని స్మరించాడు.

రాజగోపాల విలాసం ఐదాశ్వాసాల శృంగార ప్రబంధం. ఈ కావ్యంలో చారిత్రకాధారాలు, ఆనాటి తంజావూరు నాయకులకు, ఆస్థానాలకు సంబంధించినవి చాలా ఉండటం గుర్తించదగిన అంశం. అంతేగాక, కృష్ణునికి అష్ట మహిషులతో జరిగిన వివాహాన్ని వర్ణించటమే కాక, అష్ట విధ శృంగార నాయికలను తీర్చిదిద్దాడు. ఈ కావ్యంలోని ప్రత్యేకతలలో అష్ట విధ నాయికలుగా శ్రీకృష్ణ పట్ట మహిషులను వర్ణించటమే. కావ్యాలంకార శాస్త్రంలో నాయికల భేదాల్ని తెలుపుతూ అష్టవిధ శృంగార నాయికలను పేర్కొన్నారు. కాళకవి "రాజగోపాల విలాస"లో ఈ అష్టవిధ నాయికల విషయమే చెప్పాలని భావించాడు.

రుక్మిణి కలహాంతరితగా వర్ణించాడు కాళకవి. భర్తను తిరస్కరించి తరువాత పశ్చాత్తాపపడింది రుక్మిణి. కృష్ణుని లీలలకి అలుక చెందింది రుక్మిణి. కానీ, కృష్ణుడు ఆమె భవనానికి వెళ్ళాక, కృష్ణునిపై అలిగినందుకు, పోట్లాడి నందుకు పశ్చాత్తాపపడింది.

"చెలులు కనుంగోనంగ జడచే నిను కొట్టిన యట్టి నేరముల్

తలపున నిల్సి నీవు దయ తప్పిన నిప్పుడు తాళనేర్తునే" అని బాధ పడింది.

కాళకవి, సత్యభామను స్వాధీన పతితగా వర్ణించాడు. తన భవనానికొచ్చిన కృష్ణునికి ఎదురెళ్ళి అంతఃపురంలోకి తీసుకెళ్ళింది సత్యభామ. పూలపాన్పుపై సరసమాడు కొన్నారిద్దరూ. భర్తకైవసమయిన నాయిక స్వాధీనపతిక అంటారు. అలంకరించుకుని వెళ్ళే నాయిక అభిసారిక అంటారు. ఈ కావ్యంలో భద్రను అభిసారికగానూ, లక్షణను వాసకసజ్జిక గాను, జాంబవతిని విప్రలబ్ధిగాను, మిత్రవిందను ఖండిత నాయికగాను సుదంతను విరహోత్కంఠితగాను, కాళిందిని ప్రోషిత భర్తృక గాను వర్ణించాడు కాళకవి. అలంకార శాస్త్రంలో చెప్పిన లక్షణాలను అన్వయించాడు ఈ పాత్రలకి.

"సమయోచిత శృంగారము సముచితముగ బూనవమ్మ సార సముఖి, నీ రమణుడు నాతో చెప్పిన సమయస్థలి చేరనిప్పుడె చన వలయు జుయీ..." అని సమయస్థలి చెలికత్తె నాయికను చేర్చటం అభిసారికా లక్షణం. దాని భద్ర అనే కృష్ణుని భార్యకు అన్వయించి చెప్పాడు కాళకవి.

మగవారికి గల గుణముల మగువల వలపించు దనుక మమకారంబుల్, మగువలు వలచిన పిమ్మట, దగవులు మరి వేరే కావె తామరసాక్షీ" అని జాంబవతి దుతికతో వంచించిన విభుని గురించి చెప్పుకుంది. చెలుని వలన వంచన పొందిన నాయిక విప్రలబ్ధ. అన్య స్త్రీతో పొందు కూడి వచ్చిన పతిని కోపించే నాయిక ఖండిత ఈ కావ్యంలో మిత్రవంద "విలాస వైఖరిన్ చొక్కుచు వచ్చు నాయకుని చూసి కషాయితలోచనాంతయై" అన్నాడు కవి.

ఇలా రాజగోపాల విలాస కావ్యంలోని ప్రత్యేకతే అష్టవిధ నాయికల్ని వర్ణించటం.

రాజగోపాల విలాస ప్రబంధంలో ద్వారక నగరాన్ని మన్నారు కోవెలను అద్భుతంగా వర్ణించాడు కాళకవి.

నిజానికి ఈ కృతిలో కవి చమత్కృతి ప్రత్యేకతనుకానీ, కల్పనా విశేషాలు కానీ లేవు. అయినా, శృంగార ప్రబంధంలో అష్ట విధ నాయికలను చేర్చటం, ధారాశుద్ధితో కవిత చెప్పటం వల్ల రాజగోపాల విలాస ప్రబంధానికొక విశిష్టత లభించింది.